1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్

మంగళవారం | మార్చి 26, 2024 | www.navatelangana.com

అందని ద్రాక్షగా ప్రజాపాలన పథకాలు - ఎన్నికల కోడ్‌తో బ్రేక్

నవతెలంగాణ-శాయంపేట

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆరు గ్యారెంటీ పథకాలకు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బ్రేక్ పడింది. ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పథకాలు అమలు విషయంలో ప్రజలు హర్షిస్తున్నారు. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా తాజాగా రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్తుకు జీరోబిల్లులు, ఖాళీస్థలం ఉన్న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు పథకాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రజలకు అందక ముందే ఎన్నికలకోడ్‌రావడంతో ప్రజలు ఆందోళనలో పడ్డారు. ఎన్నికల కోడ్ కు ముందే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల నుండి దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. అయితే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పథకాలు అందని ద్రాక్షలా మిగిలాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు పథకాలు అమలు అయినా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందలేదు. అర్హులకు పథకాలు అందుతున్నాయని ఆశతో ఎదురుచూస్తున్న క్రమంలోనే లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిరాశపరిచింది. మిగతాలబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ కొరవడంతో సిబ్బంది తమ ఇష్టం వచ్చినట్లు దరఖాస్తులను నింపి పథకాలను దూరం చేశారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఆహార భద్రత కార్డు తలిగిన లబ్ధిదారులు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయకపోవడంతో వారికి పథకాలు దరిచేరడం లేదు. 200 యూనిట్ల లోపు విద్యుత్కు జీరో బిల్లులు, రూ.500లకే గ్యాస్‌సిలిండర్ పథకాల కోసం అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన ప్రత్యేక సేవా కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ కొంతమంది లబ్ధిదారులు సవరణలు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం జూన్ 6 వరకు నిలిపివేసింది. దీంతో అధికారులు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రత్యేక సేవా కేంద్రాన్ని మూసివేశారు. సుమారు 3 నెలల దాకా లబ్ధిదారులు ఆన్లైన్లో పథకాలు నమోదు కోసం నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి. అయితే చాలా మంది లబ్ధిదారులకు ఫిబ్రవరి నెల నుంచే జీరోబిల్లులు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీరో బిల్లు రాని వారు రెండు నెలల బిల్లులు కట్టాల్సిందేనా అని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

అతిథి అనాథాశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రమున హనుమకొండ రెడ్డికాలనీలోని అతిథి అనాథాశ్రమం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథి అనాథాశ్రమం పిల్లలు, అయ్యప్ప స్వాములు, అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండుగగా చెన్నకేశవస్వామి కళ్యాణం

నవతెలంగాణ-దామెర



మండలంలోని కోగీలవాయి చంద్రగిరి గుట్టపై ఉన్న ఆలయంలో సోమ వారం చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవానికి ఆలయ చైర్మన్ గుండా సురేష్ పుస్తెలు మట్టెలు సమర్పించగా పింగిలి పవన్ రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తుల కోరిన కోరికలు నెరవే ర్చే చెన్నకేశవ స్వామికి అనేకమంది భక్తుల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు వెంకట జోగాచార్యులు, కేశవాచార్యులు పాల్గొని కళ్యాణం కమనీయంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇతర గ్రామాల భక్తులు మాజీ సర్పంచులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా ఒకరు మృతి : ముగ్గురికి గాయాలు



నవతెలంగాణ-కమలాపూర్

ఆటోబోల్తా పడి ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు సిఐ హరికృష్ణ తెలిపారు. సోమవారం పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి గ్రామానికి చెందిన నలుగురు యువకులు గంగారపు వినయ్ (డ్రైవరు), బొల్లం ప్రశాంత్, శనిగరపు సాయి, శనిగరపు వంశీ హోలీ సంబరాలు జరుపుకొని మద్యం సేవించి శనిగరం నుండి స్వగ్రామమైన చర్లపల్లి వెళుతుండగా ఆటోడ్రైవర్ వినయ్ ఆటోను అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడవడం వల్ల గోపాలపూర్ గ్రామ శివారు వద్ద ఆటో ప్రమాదశాత్తు బోల్తాపడడంతో వంశీ అక్కడికి అక్కడే మృతిచెందగా నడికుడ మండలం చెర్లపల్లికి చెందిన బొల్లారపు ప్రశాంత్, శనిగరపు సాయి, ఆటో డ్రైవర్ గంగారపు వినయ్ గాయాలపాలయ్యారు. మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కి తరలించినట్లు తెలిపారు.

అయ్యప్పస్వామికి పాలాభిషేకం

నవతెలంగాణ-పర్వతగిరి



మండల కేంద్రం లోని శ్రీరామ మందిరంలో సోమవారం అయ్యప్ప జన్మదినం సందర్బంగా భక్తులు అయ్యప్పకు ఘనంగా పంచామతాలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గురు స్వాములు చింతకుంట్ల మల్లికార్జున్, అర్శం ఆనంద్, సముద్రాల వెంకన్న, చిట్టి, కిరణ్, మని స్వామి తదితరులు పాల్గొన్నారు.

27న అన్నారం షరీఫ్‌లో తైబజార్ వేలం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని అన్నారం షరీఫ్‌లో రేపు 27న బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలం పాట నిర్వహించబడునట్లు పంచాయతీ కార్యదర్శి మోహినోద్దీన్ తెలిపారు. ఈవేలం 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకు సంతలో వసూలు చేయు అధికారం వుంటుందని తెలిపారు. అలాగే ఈ వేలం పాటలో పాల్గొనే పాటదారులు ముందుగా రూ.2 లక్షలు నగదు రూపంలో చెల్లించాలని, అలాగే టెండర్ షెడ్యూల్ ధర రూ.500 లు చెల్లించి రశీదు పొందాలని గ్రామపంచాయతీ కి ఎలాంటి పన్నులు గాని బాకీ వుండకూడదని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమాన్ దేవాలయానికి వితరణ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏనుగల్ లోని పాత శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నకు భక్తుల సౌకర్యార్థం గుంతలను చదును, మొరం రవాణకు అయ్యే ఖర్చులను గడ్డం లింగమూర్తి వితరణ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు, ఆలయ అర్చకులు అయ్యనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలు ?



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరు బీఆర్ఎస్ నేతల ప్రమేయం వున్నట్లు పోలీసుల అదుపులోవున్న ఏసీపీ ప్రణీత్‌రావు చెప్పినట్లు వార్తలు వస్తుండడంతో బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో కలకలం రేగింది. విపక్ష నేతలు, పలువురు హీరోయిన్లు, పలువురు రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడి కావడంతో ఈ వ్యవహరమంతా ఎస్ఐబి ఛీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్‌రావు నేతృత్వంలో జరగ్గా నాటి అధికార బిఆర్ఎస్ పార్టీలో ఇద్దరు కీలకనేతలకు ఇందులో ప్రత్యక్షంగా సంబంధాలున్నట్లు తెలుస్తుంది. ఈ నేతల పేర్లను సైతం ప్రణీత్‌రావు విచారణ అధికారులు తెలియచేయడంతో ఆ నేతలకు నోటీసులు జారీ చేసే అవకాశముంది. ఇప్పటి వరకు బిఆర్ఎస్ పెద్దలు ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పెదవి విప్పకపోవడం సందేహాలకు తావిచ్చింది. పార్లమెంటు ఎన్నికల వేళ ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో మలుపు తిరుగుతుండడంతో బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో కలవరం మొదలైంది. ఈ కేసులు బిఆర్ఎస్ నేతలు అరెస్ట్ అయితే పరిస్థితి ఎలా వుంటుందన్నది పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. అదేజరిగితే ఎన్నికల ప్రచారంలో ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు సర్వత్రా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉత్కంఠ రేపుతుంది. ఈ కేసులు తొలుత అరెస్ట్ అయిన

పార్టీ శ్రేణుల్లో కలవరం..

ఏసీపీ ప్రణీత్‌రావు ఇచ్చిన వివరాలు ఈ కేసును రోజుకో మలుపు తిప్పుతున్నాయి. ఇప్పటి వరకు ఈ కేసు విషయంలో బీఆర్ఎస్ అగ్రనేతలు ఎవరూ పెదవి విప్పకపోవడం పలు సందేహాలకు తావిస్తుంది. ఇదిలావుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఇన్స్‌పెక్టర్లను అదుపులోకి తీసుకొని విచారణ చేసిన నేపథ్యంలో తాజాగా భూపాలపల్లి జిల్లాలో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న భుజంగరావును సైతం అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఈ కేసులో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు అదుపులో వున్న పోలీసు అధికారులు వెల్లడించడంతో ఈ కేసులు బిఆర్ఎస్‌కు చెందిన కీలక నేతల పాత్రవున్నట్లు ప్రచారం జరుగుతుంది.

విపక్ష నేతలపై నిఘా..

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసిన వ్యవహారం బహిర్గతం కావడంతో ఇందుకు ఆదేశించిన నాటి ప్రభుత్వంలో వున్న నేతలెవరు ? అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల అదుపులో వున్న ఎసిపి ప్రణీత్‌రావు పలువురు బిఆర్ఎస్ నేతల పేర్లు వెల్లడించినట్లు ప్రచారం జరుగుతుంది. ఇద్దరు బీఆర్ఎస్ నేతల పేర్లు తెలిపారని ప్రచారం జరుగుతుండడంతో బిఆర్ఎస్ శ్రేణులు కలవరపడుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్ది ఒకవైపు ఢిల్లీ లిక్కర్ కేసులో పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ కాగా, ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ నేతలు అరెస్ట్ అయితే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతికూల పవనాలు వీచడం ఖాయమని బీఆర్ఎస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

తెరపైకి 'ఎర్రబెల్లి' పేరు ..?

ఫోన్ ట్యాపింగ్ కేసు నిత్యం చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తనను ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతుందని చెప్పడంతో ఈ కేసులో ఆయనకు నోటీసు ఇచ్చే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతుంది. 'ఎర్రబెల్లి' నియోజకవర్గం పాలకుర్తిలో గతంలో పనిచేసిన ఇద్దరు ఇన్స్‌పెక్టర్లను సైతం ఈ కేసులో అదుపులోకి తీసుకొని విచారించినట్లు సమాచారం. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇన్స్‌పెక్టర్లు, ఏసీపీల పోస్టింగ్‌లన్నీ స్థానిక ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరిగిన విషయం విదితమే. దీంతో ఈ కేసులో ఇద్దరు బిఆర్ఎస్ నేతల ప్రమేయం నేరుగా వున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరు ఇందులో వుండే అవకాశముందని చర్చ సాగుతుంది.

ఈ విషయాన్ని గతంలోనే 'ఎర్రబెల్లి' ప్రస్తావించడం గమనార్హం. బీఆర్ఎస్ ప్రభుత్వపెద్దలు, నేతలు వారి నియోజకవర్గాల్లో విపక్ష నేతలను కట్టడి చేయడానికి పలువురి ఫోన్‌లను ట్యాపింగ్ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తుండడంతో ఈ వ్యవహారంలో బిఆర్ఎస్ పెద్ద తలకాయల ప్రమేయం ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వాడవాడలా ఘనంగా హోలీ సంబరాలు













నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ జిల్లా టి ఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ శ్రద్ధ శుక్లను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి హోలీ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు, ఉద్యోగులు ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నట్టు తెలుపుతూ జిల్లాను అభివద్ధిలో అగ్ర భాగాన నిలుపాలని పేర్కొంటూ జిల్లా ప్రజలకు, ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘ నాయకులు శ్యాంసుందర్,రాము నాయక్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు రాజమౌళి, సురేష్, శ్రీనివాస్, రాజేష్ కన్నా ,రాంప్రసాద్ ,రాజీవ్, అనూప్, భగవాన్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఉదయ్‌భాస్కర్, నరేష్, రామాంజనేయులు, హమీద్, శివ, హరినాథ్, మోహన్‌రావు, అజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఓల హోలీ శుభాకాంక్షలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కు టీజీఓలు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ జగన్ మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను వారి నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యుఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల సమక్షంలో హోలీ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కార్యదర్శి ఫణికుమార్, కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, కిరణ్ కుమార్, సాయిరాజ్, కోల రాజేష్‌కుమార్, రవి, సుధీర్ కుమార్, సారంగపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తా : చల్లగాలులు వేడెక్కే వేళ ఫాల్గుణ పౌర్ణమి రోజు వసంతుడికి ఆహ్వానం పలుకుతూ జరుపుకునే రంగుల పండుగ హోలీ పండుగకు స్వాగతం పలుకుతూ కేయూసీ సెకండ్ గేట్ విద్యారణ్యపురి హన్మకొండ సంస్కతి అపార్ట్‌మెంట్‌లో ఉత్సాహంగా హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ అధ్యక్షులు పెరుమళ్ళ సుమలత శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అందాలన్నీ ఆవిష్కరించే వసంత రుతువు ప్రవేశించిన తర్వాత జరుపుకునే తొలి పండుగ హోలీ పండుగ అన్నారు. భారతదేశంలో ముఖ్యమైన పండుగలలో ఒక్కటైన రంగుల పండుగ హోలీ చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా జరుపుకునే పండుగ అని, కృత్రిమరంగుల్లో వాడే కెమికల్స్ వల్ల కళ్ళు దెబ్బ తింటాయని, ప్రతి ఒక్కరు ప్రకృతిలో లభించే వివిధ పూల ద్వారా తయారుచేసిన సహజ రంగులతో హోళీని జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ చిట్టి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెలగందుల ప్రసన్న, జాయింట్ సెక్రెటరీ సుంకి శాల అనిత తిరుపతిరావు, అడ్వైజర్ మంచాల సుజాత రమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గోవర్ధన్ వెంకట చారి, కర్ర పాపిరెడ్డి, డాక్టర్ సునీత గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : హోలీపండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో పత్రికా విలేఖరులు ఒక దిక్కు కలిసి ఎస్సై వెంకన్న పోలీసు సిబ్బందితో హోలీ జరుపుకున్నారు. ఉదయం నుంచే ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా మండలంలోని ఇస్లావత్ తండాలో సేవాలాల్ సేన యూత్ ఆధ్వర్యంలో వేడుకలను పాటలుపాడుతూ నత్యం చేసి కలర్ ఫుల్ 'రంగోళీ'లో మునిగి తేలారు. చింతనెక్కొండలో పలువురు వేడుకల్లో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాలు, యువజన సంఘాలు, మహిళలు,పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని ఊరుగొండ, దామెర, ఓగ్లాపూర్, పులకుర్తి ,వెంకటాపూర్, సింగరాజుపల్లి, దుర్గంపేట, తక్కలపాడు మొదలైన అన్ని గ్రామాలలో యువత పెద్దలు మహిళలు మాజీ సర్పంచులు అన్ని వర్గాల వారు రాజకీయలకు అతీతంగా ఆనందోత్సవాలతో హెూలీ పండుగను రంగులు చల్లుకొని కేరింతలతో ఉత్సాహంగా హోలీని ఘనంగా జరుపుకున్నారు.

శాయంపేట : మండల పరిధిలోని 24 గ్రామాలలో సోమవారం హెూలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు, వద్ధులు సైతం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హెూలీ సంబరాలను జరుపుకున్నారు. శాయంపేట మండల వర్కింగ్ జర్నలిస్టులు హెూలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులు బాల్ని తిలక్ బాబు, మంత్రి వెంకటేశ్వర్లు, రమేష్, సామల సూర్య ప్రకాష్, దామెర రాజేందర్, కొత్తపల్లి నవీన్, రంగు శ్రీధర్, గన్ను సంతోష్, బాసాని బాలకష్ణ, కొడిమాల రాజేందర్, తుడుం రవీందర్, రాజాచారి, సురేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రతి ఏడాది ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు హోలీ పండుగను జరుపుకుంటాం. హోలీ పండుగను హో లికా పూర్ణిమ అని కూడా పిలుస్తారు. దేశవ్యాప్తంగా హోలీపండుగ ఘనంగా నిర్వహించారు. మండలం కేంద్రంతో పాటు మండల పరిధిలో ఉన్న ఆయా గ్రామాల్లో చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్ద వాళ్ల వరకు రంగులు పూసుకుంటూ ఏంతో ఆనందంగా పండుగను జరుపుకున్నారు. ఈపండుగ ముఖ్య ఉద్దేశం జీవితాల్లో సంతోషాన్ని నింపడం. కేవలం రంగులతోనే కాకుండా డీజే పాటలు, రెయిన్ డాన్స్‌లతో గంతులువేశారు. పర్యావరణ పరిరక్షణ దష్టిలో పెట్టుకొని కెమికల్ రంగులతో ఆడకుండా సేంద్రీయ రంగులతో హోలీని జరుపుకున్నారు. మండల కేంద్రంలో అయితే తెల్లవారుజామున నుంచే హోలీ సంబరాలు మొదలయ్యాయి. యూత్ మొత్తం ఆటపాటలతో రంగుల హరివిల్లులో స్నేహితులతో, కుటుంబాలతో కలిసి ఈ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు మార్క సుమలత రజనీకర్ సొంత గ్రామమైన హౌజుబుజుర్గు గ్రామంలో, జెడ్పిటిసి కక్కేర్ల రాధిక రాజు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-దామెర



దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్‌పై నుండి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఈనెల 21న దామెర మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన సంఘాల రాజు (32) ఒగ్లాపూర్ నుండి దామెరకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గంమధ్యలో తనకు తానే అదుపుతప్పి కింద పడగా బలమైన గాయాలు కావడంతో వెంటనే అతనిని ఎంజీఎం ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం మరణించాడు. మృతుని తండ్రి సంఘాల శంకర్ ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టిలో మాణిక్యాలు నల్లబెల్లి యువత

నవతెలంగాణ-వరంగల్

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం వివిధ శాఖల్లో చేపట్టిన నియమకాల్లో నల్లబెల్లి ప్రభుత్వ హైస్కూల్లో చదువుకున్న యువతీ యువకులు వరుసగా ఉద్యోగాలు సాధించి మట్టిలో మాణిక్యాలుగా ప్రతిభను చాటుకుంటున్నారని డిఆర్డిఏ-సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య అన్నారు. సోమవారం మండలంలోని నల్లబెల్లిలో ఎక్లేసియా ప్రార్థన మందిరంలో కొండేటి సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల వెలువడిన గ్రూపు ఫోర్త్ ఫలితాల్లో నల్లబెల్లి చెందిన బిర్రు సౌజన్య ఆర్టీసీ లో క్లారికల్ పోస్టులో అకౌంటెంట్‌గా నియమించబడడం అభినందనీయమన్నారు. ముందుగా సౌజన్యను పూలమాలలు శాలులతో ఘనంగా సన్మానించారు. అనంతరం కొమురయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అతికొద్ది కాలంలోనే నల్లబెల్లి ప్రభుత్వ ఉన్నంత పాఠశాలలో విద్యానభ్యసించిన నిరుపేద విద్యార్థులు తాటికాయల రంజిత్ కానిస్టేబుల్‌గా, తాటికాయల మౌనిక గురుకుల పాఠశాలల పిఈటిగా, బిర్రు సౌజన్య ఆర్టీసీలో అకౌంటెంట్‌గా వరుసగా ఉద్యోగాలు సాధించి నల్లబెల్లి విద్యానగర్ కు పూర్వవైభవాన్ని తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.



ఈ సన్మాన కార్యక్రమంలో సంఘ పెద్దలు గ్రామస్తులు బిర్రు ఏలియా గోలి పుల్లయ్య క్రిస్టఫర్ బిర్రు కరుణాకర్ కుమారస్వామి జక్కి గోపాల్ పిడి మానస పూలమ్మ సారమ్మ గోలి రజిత స్వరూప అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
మంగళవారం | మార్చి 26, 2024 | www.navatelangana.com

కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంను రామగుండం పోలిస్ కమిషనర్ సందర్శన

నవతెలంగాణ-మహదేవపూర్



మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంను సోమవారం రామగుండం పోలిస్ కమిషనర్ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికీ దేవస్థానం అర్చకులు,వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారికి అభి షేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశా రు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ సిఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కల్గించిన వారిపై కేసు

ఎస్సై ప్రసాద్

నవతెలంగాణ-మహాదేవపూర్

విదులకు ఆటంకం కల్గించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ రాజయ్య శ్వాస సమస్యతో ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. డాక్టర్ రాజ్ కుమార్ రాజయ్యను పరీక్షించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడినుంచి మహదేవ్ పూర్ తీసుకొచ్చి సుల్తాన్ రాజయ్య మృతిచెందాడంటూ సుల్తాన్ నవీన్, సుల్తాన్ సునీల్, సుల్తాన్ శామ్యూల్ ముగ్గురు విధుల్లో ఉన్న డాక్టర్ రాజ్ కుమార్ పట్ల దుర్భషలాడి ఆస్పత్రి అద్దాలు పగల గొట్టి బెది రించారు. ఈ ఘటనంలో డాక్టర్ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



అసత్య ఆరోపణలు చేస్తున్న

వారిని అరెస్టు చేయాలి

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవిచందర్

నవతెలంగాణ - ములుగు

సామాజిక మాధ్యమాల్లో మంత్రి సీతక్క, మానుకోట రిజిస్ట్రార్ తస్లీమా గురించి అసత్య ఆరోపణలు చేస్తున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని, ప్రతిపక్ష నేతలు కావాలనే అసత్య ఆరోపణలు చేస్తూ శు నకానందం పొందుతున్నారని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ రవిచందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశం లో రవిచందర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క తస్లీమా మహమ్మద్‌ల పేరు వినగానే ములుగు జిల్లాలో తెలియని వారుండరన్నారు. ములుగు ఎమ్మెల్యేగా ఒకరు సబ్ - రిజిస్ట్రార్గా ఇంకొకరు బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఎప్పుడు ప్రజాసేవ చేస్తూ గత కొన్నేండ్ల నుండి ప్రతి ఒక్కరికీ కష్టాల్లో అండగా నిలుస్తూ మంచి మానవతావాదులుగా, సేవకురాలుగా ప్రజల మన్ననలు పొందిన ట్టుచెప్పారు. వారిపై కుట్రపూరితంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తస్లీమా దేశంలోని వ్యవసాయం గురించి, రైతు, రైతు కష్టం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రతి ఆదివారం రైతు కూలీల మారి వ్యవసాయం ప్రాముఖ్యతను చాటిందన్నారు. అలాంటి తస్లీమా పై కొందరు వ్యక్తులు అవినీతి మచ్చ వచ్చేలా చేసిన కుట్రలో తస్లీమా పావు అయి ఇవ్వాళ అవినీతి అధికారిగా మిగిలిపోయిందని ఆవే దన వ్యక్తం చేశారు. మానుకోట రిజిస్ట్రార్ కార్యాలయంలో పొరుగు సేవల ఒప్పందంపై పని చేస్తున్న మూడవ వ్యక్తి దగ్గర ఏసీబీ దాడుల్లో డబ్బులు దొరకగా అతను కావాలని తస్లీమా పేరు చెప్పడం జరిగిం దని అన్నారు. తస్లీమా దగ్గర నిజంగానే డబ్బులు దొరకలేదనే విషయాన్ని గమనించాలని అన్నారు. తస్లీమాకు అందరూ అండగా నిలబడాలని కోరారు. ఇప్పటికీ నకిలీ ఐడిలతో సామాజిక మాధ్య మాల్లో ఫోటో మార్ఫింగ్ చేస్తూ సీతక్కపై అసత్య ప్రచారం చేస్తున్న వారిని పోలిస్ యంత్రాంగం గుర్తించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జక్కుల రేవంత్ యాదవ్, జయాకర్, అంగోత్ వంశీ, రాజేందర్, చందు, దేవ్ సింగ్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంటనే అరెస్టు చేయాలి

మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బెజ్జూరి శ్రీనివాస్

నవతెలంగాణ -తాడ్వాయి

సామాజిక మాధ్యమాల్లో మంత్రి సీతక్క, మానుకోట రిజిస్టర్ తస్లీమా వారిపై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ఆరోపణలు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బీరెల్లి సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శ్రీనివాస్ అన్నారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. ఎక్కడ ఏం జరిగిన, ఎవరు ఏం చేసినా సీతక్క పై రుద్దడం పరిపాటి అయిందన్నారు. కొందరు ప్రతిపక్ష నేతలకు, అలాంటి వారికి సిగ్గుండాలిని దుయ్యబట్టారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్న వెంకటేష్ దగ్గర డబ్బులు దొరకగానే కావాలని తస్లీమా గారిని అవినీతిపరురాలుగా చిత్రీకరించడం కుట్రపూరిత చర్య అని మండిపడ్డారు. ఈ మధ్య ఎదుగుతున్న, మంచి పేరును సంపాదించుకుంటున్న నాయకులపై, అధికారులపై కావాలని అవినీతి ఆరోపణలు చేయడం కొందరికి అలవాటైందని అన్నారు. గత ఇరవై యేండ్ల రాజకీయంలో ఎటువంటి మచ్చ లేని సీతక్క గారిపై కూడా నేడు కావాలని కొందరు ఆరోపణలు చేయడం నీచాతి నీచం అని ఆరోపించారు. నిజమైన సేవకులు సీతక్క, తస్లీమా పై కావాలని అసత్య ప్రచారం చేస్తున్న కొందరిని వెంటనే అరెస్టు చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.







అంబరాన్నంటిన హోలీ సంబరాలు

గణపురం : గణపురం మండల కేంద్రం లోని కోట కాలువ సమీపంలో ఉపాధి హామీ కూలీలు హెూలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కోట కాల్వ పనులు ఉపాధి హామీ కింద పనులు జరుగుతుండగా కూలీలు పను లు చేసిన అనంతరం హెూలీ సంబరాలు జరుపుకున్నారు.

మల్హర్‌రావు : మండల కేంద్రమైన తాడిచెర్లతోపాటు అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా హెూలీ సంబరాలు అంగరంవైభ వంగా నిర్వహించారు. అనంతరం నవ వసం తానికి స్వాగతం పలుకుతూ కేరింతలు కొ ట్టారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు,యువత పాల్గొన్నారు.

మహదేవపూర్ : మహాదేవపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామా లలో సోమవారం హెూలీ సంబరాలు ఘనం గా నిర్వహించారు. మండల కేంద్రం లోని గ్రీన్ వుడ్ పాఠశాలలోకరస్పాండెంట్ చీరల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హెూలీ వేడు కలు నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగాప్రజా ప్రతినిధులు, అధికారులు హెూలీ వేడుకలు నిర్వహించారు.

కోల్‌బెల్ట్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో హెూలీ పర్వదినాన్ని పురస్కరించు కొని సింగరేణి ఉద్యోగులు, కార్మికులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగితేలారు. సింగరేణి సెలవు దినం కావ డంతో జీయం శ్రీనివాసరావుతో సహా ఉద్యో గులు, అధికారులు, కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. రంగుల పండుగ కావడంతో కోల్ బెల్ట్ ప్రాంతంలోని వ్యాపార సముదా యాలన్నీ మూతపడ్డాయి. సింగరేణి ఉద్యోగులు, కార్మికులంతా విధుల యొక్క ఒత్తిడిని మర్చిపోయి చిన్నపిల్లల్లా రంగులు పూసుకుంటూ, డీజేల సౌండ్స్ తో నృత్యాలు చేస్తూ ఆనంద డోలికల్లో మునిగిపోయారు.







మంగపేట : హెూళీ పండుగ వేడుకలను మండల ప్రజలు ఘణంగా జరుపుకున్నారు. ముఖ్యంగా యువకులు సోమవారం ఉదయం నుంచే ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హెూళీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజ కీయ ప్రముఖులు, అధికారులు, పిల్లలు ఉత్సాహంగా హెూళీ వేడుకల్లో పాల్గొన్నారు.



గోవిందరావుపేట : ఆనందోత్సాహాల మధ్య మండల వ్యాప్తంగా రంగుల పండుగ హెూలీని సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పస్రా సుందరయ్య నగర్ లో గుడిసె వాసులు రంగు లు పూసుకుని హెూలీ సంబరాలు జరుపుకున్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు పోలీసు ఉన్నతాధికారులతో రంగులు పూసుకుని హెూలీ పండుగను సెలబ్రేట్ చేసుకున్నారు. మండల విద్యుత్ శాఖ అధికారులు తెల్లవారుజామునుండే రంగులు పోసుకొని హెూలీ పండుగకు వన్నె తెచ్చారు.

తాడ్వాయి : మండలంలోని ప్రతి గ్రామంలో హెూలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల హెూలీ సంద ర్భంగా కామ దహనం నిర్వహించారు. మండల పార్టీల అధ్యక్షులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

గణపురం : కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గణపేశ్వరునికి హెూలీ పర్వదిన సందర్భంగా మోదుగు పూలతో ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. గత 12 సంవత్స రాలుగా హెూలీ పండుగ సందర్భంగా స్వామి వారిని మోదుగు పూలతో అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. హెూలీ పర్వదినం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు నరేష్ వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఒప్పందం చేసుకొని రెండేండ్లు....

- పూర్తికాని రోడ్డు పనులు
- కాంట్రాక్టు రద్దు చేయక పోగా ఎస్టిమేట్లు పెంచిన అధికారులు
- తాత్కాలిక మరమ్మతులతో గుంతల్లో మట్టి
- 10మంది మృతిచెందినా స్పందించని అధికారులు

నవతెలంగాణ-వెంకటాపురం





కాంట్రాక్టర్‌కు రాజకీయ అండ ఉంటే అధికార గణం అడుగులకు మడుగులొత్తడం సహజమే. కానీ కాంట్రాక్టరే రాజకీయ నాయకుడై ఇష్టానుసారంగా వ్యవహరిస్తే జరిగే పరిణామాలకు బాధ్యులు ఎవరనేది ప్రశ్నార్థకమే. ఏకంగా ఏజెన్సీ ప్రాంతంలోని ఒక రోడ్డును కల్పతరువుగా మార్చు కుని పదిమంది ప్రయా ణీకుల మృతికి కారకుడైనా చర్యలు తీసుకోక పోగా మరింత లాభం చేకూరుస్తున్న అధికారుల తీరు చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ప్రభుత్వం మారి వంద రోజులు గడచినా వా రు మౌనం వహిస్తున్నారంటేనే అర్థమవుతోందని పలువురు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్ ధన దాహానికి, అధికారుల అలసత్వానికి ప్రత్యక్ష తార్కా ణంగా నిలిచిన రహదారిపై నవతెలంగాణ ప్రత్యేక కథనం..

భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నం కలిపే రహదారిలో ములుగు జిల్లా ఏకన్నగూడెం నుంచి జగ న్నాథపురం వరకూ 50 కిలోమీటర్ల బీటీ రోడ్డు పునర్ని ర్మాణానికి రెండేండ్ల క్రితం టెండర్లు పిలవగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ రాజకీయ నాయకుడు పనిని దక్కించుకున్నాడు. ఆరు నెలల్లో పూర్తి చేయాల్సిన పనులను సంవత్సర కాలంగా కనీసం ప్రారంభించలేదు. ఇసుక లారీల తాకిడితో రోడ్డు గోతులు పడి మరింత అధ్వాన్నంగా మారిం ది. ఎధిర వెంకటాపురం మధ్య పడిన గోతులతో అనేక ప్ర మాదాలు జరిగి వివిధ సంఘటనల్లో పది మందికి పైగా మత్యువాత పడ్డారు. సకాలంలో పనులు చేయని కాంట్రాక్టర్ కి అప్పగించిన పనులను రద్దు చేసి మరో కాంట్రాక్టర్ కు అప్పగించాల్సిన రోడ్లు భవనాల శాఖ అధికారులు మౌనం వహించారు. ప్రజలు ఆందోళనకు దిగినా పట్టించుకోలేదు. రోడ్డు గోతులు పడడాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకున్న సదరు కాషాయ కాంట్రాక్టర్ ఎస్టిమేట్ ను పెంచుకోవడం మరింత వివాదాస్పదమైంది. రామచంద్రా పురం వద్ద కేవలం రెండు మూడు కిలోమీటర్ల పనిని మాత్ర మే గత సంవత్సరం చేసి మిగిలిన పనిని వదలివేశాడు. వెంకటాపురం నుంచి జగన్నాథపురం వరకూ దాదాపు 15 కిలోమీటర్ల బీటీ రోడ్డును గత సంవత్సరం వేయగా వేసిన మూడు నెలలకే అది ఎక్కడికక్కడ లేచి పోయి గుంటలు పడింది. రహదారి విషయంలో ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా కాంట్రాక్టర్ ఇటీవల కొంత దూరం రోడ్డును తవ్వి గుంటల్లో మట్టి పోశాడు. దీనితో దుమ్ము లేచి ముందు వెళ్ళే వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గులాబీ కాంట్రాక్టర్ చేస్తున్న ఆగడాలను అరికట్టి అతని కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సదరు కాంట్రాక్టర్ కి సహకరించి అక్రమాల్లో పాల్పం చుకున్న ఇంజనీర్లపై విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరాలని రెండు జిల్లాల వారు సమాయ త్తమవుతున్నారు.

మండలంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకం ?

- రాజీనామాలు చేస్తున్న నాయకులు
- కాంగ్రెస్, బీజేపీ కండువాలు కప్పుకోనున్న కార్యకర్తలు !

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని రాజకీయ నాయకులు అభిప్రాయపడుతు న్నారు. గత పది సంవత్సరాలుగా ఒక వెలుగు వెలిగిన వారు ఇప్పుడు పక్క పార్టీల వైపు చూస్తున్నారు. కవిత జైలు కు వెళ్లడం పార్టీ నుండి రోజుకొక ఆర్థిక నేరంపై అభి యోగాలు వస్తుండడం, ఎంపీగా పనిచేసిన కవిత మండ లానికి చేసిన అభివృద్ధి ఏమి లేకపోవడం మళ్లీ ఓట్లు అడగ లేమంటూ కొందరు నాయకులు కారణాలు చెబుతున్నారు.



బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయికుమార్ సోమ వారం తన ప్రాథమిక సభ్యత్వానికి, మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేసి జిల్లా నాయకులకు పంపినట్లు పాత్రికే యులకు తెలిపారు. కాగా రేపు ఎల్లుండో జరిగే అధికార పార్టీ సమావేశంలో మండలం నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రె స్ కండువా కప్పుకొనున్నరని వార్త మండల వ్యాప్తంగా బగ్గు మంటోంది. పార్టీని నియోజకవర్గస్థాయిలో శాసించిన సీనియర్ నాయకులు డాక్టర్ అజ్మీర ప్రహ్లాద్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ వంటి వాళ్లు బీజేపీలో చేరగా వారికి నమ్మకంగా మండలంలో ఉన్న నాయకులు త్వరలో బిజెపి కండువా కప్పుకానున్నారని ఆ పార్టీ నాయకులు విస్తత ప్రచా రం చేస్తున్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారం మొదలు కావ డంతో పార్టీ మారే వారి సంఖ్య మండలంలో గణనీయం గానే కనిపించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ కోవిదులు అంటున్నారు. ఈ పార్టీ నుండి అటు కాంగ్రెస్ వైపు కు.. బీజేపీలోకి వెళ్లే వారెవరు..? చివరకు మిగిలేది ఎవరు ? అనే ప్రశ్న ఇప్పుడు మండల వ్యాప్తంగా రాజకీయంగా చర్చనీ యాంశంగా మారింది. గ్రామపంచాయతీ సర్పంచ్ , ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల వరకు మండలంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని అపోజిషన్ నాయకులు పలు సందర్భాల్లో బాహాటంగానే చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తే అపోజిషన్ నాయకుల మాట నిజమే నని అనిపిస్తుంది. ఈ విషయమై కొందరు బీఆర్ఎస్ నాయకులు అలాంటిదేమీ లేదని చెబుతుండగా నికార్సైన తెలంగాణ వాదులే పార్టీలో ఉంటారని వారి పార్టీని నడిపి స్తారని అధికారంలో లేనప్పుడు పార్టీని నడిపిన వారే నిజ మైన పార్టీ వారసులని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ వైఖరి తీరుతున్నలు మార్పులు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందేనని పలువురు రాజకీయ మేధావులు అంటున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
జనగామ
మంగళవారం | మార్చి 26, 2024 | www.navatelangana.com

రెండు రోజులు జాతీయ సదస్సు

నవతెలంగాణ-హన్మకొండ

స్కూల్ ఆఫ్ మనజ్మేంట్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, సుబేదారి, హనంకొండ, కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు "ఫిన్టెక్ రెవల్యూషన్ రీషేపింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్ డిజిటల్ ఏజ్ అనే అంశం పై మార్చి నెల 27, 28వ తేదీలలో, స్కూల్ అఫ్ మనజ్మేంట్ సెమినార్ హాల్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, సుబేదారి, హనంకొండ లో నిర్వహిస్తునట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి, కళాశాల స్కూల్ అఫ్ మనజ్మేంట్ ఇంచార్జ్ హెడ్ డాక్టర్ కనకయ్య మాదాసి ఒక ప్రకటనలో తెలిపారు. 27 వ తేది మొదటి రోజు ప్రారంభ సమావేశం ఉదయం 10.00 గంటలకు ప్రారంభం అవుతుంది అని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ విచేస్తారని,

విశిష్ట అతిదిగా హైదరాబాద్, యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ స్కూల్ అఫ్ మనజ్మేంట్ ఆచార్యులు ఆచార్య చేతన్ శ్రీవాస్తవ్, వరంగల్ సాఫ్ట్ టెక్ సంచాలకులు (మానవవనరుల) నరీన్ కశ్యప్ కీలక ఉపన్యాసం చేస్తారని, అతిధులు గా పరిక్షల నియంత్రణ అధికారి, టి.ఎస్. ఐ.సెట్ కన్వీనర్ ఆచార్య ఎస్. నరసింహ చారి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య పి.అమరావేణి, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్ విచేస్తారని, విద్యార్థులు, పరిశోధకులు, బోధనా సిబ్బంది హాజరు కావాలని వారు తెలిపారు.

హోలీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

హోలీ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. హోలీ పండుగను పురస్కరించుకొని సోమవారం క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సంబరాల్లో కుటుంబ సమేతంగా కలెక్టర్ పాల్గొని ఆనందోత్సవాలతో రంగులు చల్లుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రసాయన రంగులకు దూరంగా ఉండాలని, ప్రకతి సహజసిద్ధమైన రంగులనే వాడాలని ఆయన భావించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ హోలీ పండుగను జిల్లా ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రవీందర్, సిబ్బంది పాల్గొని కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి రంగు బొట్టు పెట్టారు. అధికారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. అనంతరం అలాయ్ బలాయ్ తీసుకొని సంబరాలు చేసుకున్నారు.



జనగామ : బతుకమ్మ కుంటలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువత కోలాట ఆటలు ఆడి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని రంగుల హరివిల్లులో మునిగితేలారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ దామోదర్‌రెడ్డి, సీఐ రఘు, పోలీస్ సిబ్బంది హోలీ సంబరాలను నిర్వహించారు. ఆర్టీసీ చౌరస్తా అంబేద్కర్ నగర్ ధర్మకంచ గుండ్లగడ్డ దూరు పార్కు రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు.

కొడకండ్ల : హోలీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు వయసు తారతమ్యాలు లేకుండా యువకులు మహిళలు ముసలి ముతక తేడా లేకుండా రంగులు రుద్దుకుంటూ ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

బచ్చన్నపేట : మండల కేంద్రంలో హోలీ వేడుకలు మిన్నంటాయి. రంగుల పండుగ హోలీ సందర్భంగా చిన్నాపెద్ద తేడా లేకుండా సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రంగులు పూసుకొని సంబరాలు చేశారు. హోలీ ఆటలు ఆడుకుంటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు.

'టెక్స్‌టైల్స్'లో శ్రమ దోపిడీ

పర్యావరణ అనుమతులకు ఎగనామం
ఎమ్మెల్యే ఆదేశాలూ బేఖాతరు
కార్పొరేట్ కంపెనీలకు షరతులు వర్తించవా
లేబర్ అధికారుల పర్యవేక్షణ లోపం
అమరుల త్యాగాలకు విలువ లేని వైనం

నవతెలంగాణ-గీసుగొండ

వరంగల్ జిల్లాని గీసుగొండ, సంగెం మండలాలలో 1350 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న టెక్స్‌టైల్ పార్కులో శ్రామికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణ పనుల కోసం గణేష్‌అండ్ గణేష్ కంపెనీ, కిటెక్స్ కంపెనీ కాంట్రాక్ట్ తీసుకుని చేస్తున్నాయి. అయితే ఆయా కంపెనీలు సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి పనులు చేయిస్తుండటంతో సబ్ కాంట్రాక్టర్లు కార్మికులతో ఎక్కువ పని చేయించుకుంటూ తక్కువ కూలి డబ్బులు చెల్లిస్తూ వారి శ్రమను దోచుకుంటు న్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు భేఖాతరు...

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కు సందర్శనకు వచ్చినప్పుడు కార్మికులను ఉద్దేశించి కాంట్రాక్టర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. కార్మికులు పనిలో ఉదయం 8గంటలకి వెళితే సాయంత్రం 8గంటలకు పని దిగాలి. అంటే 12 గంటలు పని చేయిస్తున్నారు. కార్మికులకు శ్రమదోపిడీకి గురి చేస్తే సహించేదిలేదని, శ్రమదోపిడీ చేస్తే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పలు కీలక ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని కాంట్రాక్టర్లు బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కార్మికుల గోస పంచుకుంటున్నారని ప్రజలు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ అనుమతులకు ఎగనామం

గతంలో పర్యావరణ కాలుష్య అనుమతులపై ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఆయా కంపెనీలను అనుమతుల వివరాలను అడిగారు. ఓ మంత్రి అండాతో గుట్టుచప్పుడు కాకుండా ఆ విషయాన్ని బయటకు పొక్కకుండా చేశారని అక్కడ పని చేసే కార్మికులే బాహాటంగా చర్చించుకోవడం గమనార్హం.

లేబర్ అధికారుల పర్యవేక్షణ లోపం



దేశంలోనే అతి పెద్ద మెగా టెక్స్‌టైల్ పార్కు 1350 ఎకరాల విస్తీర్ణంలో వరంగల్‌లో నిర్మాణం చేపట్టారు. అలాంటి టెక్స్‌టైల్ పార్కులోనే శ్రమదోపిడీ జరిగి వారి కష్టం వృథా అయిపోతుంటే లేబర్ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంపై పలువురు లేబర్ అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు.

అమరుల త్యాగాలకు తిలోదకాలు

చికాగో నగరంలో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఎంతో మంది కార్మికులు పోరాడి ఖాకీల తూటాలకు అమరులు అయ్యారు. ఆ అమరవీరుల త్యాగాల వల్లే 8 గంటల పని ప్రపంచంలో, మనదేశంలో అమలులోకి వచ్చింది. ఆ మరణాలకు విలువ లేకుండా కార్పొరేట్ సంస్థలు వారికి ఇష్ట మొచ్చినట్టుగా వ్యవహరిస్తున్నాయని అని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సమాన పనికి సమాన వేతనం కల్పించాలి : గోనె కుమార స్వామి (ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి కమిటీ సభ్యులు)



కార్మికుల శ్రమ దోపిడీకి కారణం కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి,టెక్స్ టైల్ పార్కులో స్థానికులకే అవకాశం కల్పించాలి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని కార్పొరేట్ సంస్థలు చేసే శ్రమ దోపిడీకి అడ్డుకట్ట వెయ్యాలి.

లేబర్ అధికారులు వెంటనే స్పందించాలి : తోగటి బ్రహ్మచారి (సీఐటీయూ జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు)



టెక్స్‌టైల్ పార్కులో విపరీతమైన శ్రమ దోపిడీ జరుగుతుంది. ఆ దోపిడీని గురించి ప్రశ్నించే అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు లేకపోవడం బాధాకరం. కంపెనీలో జరుగుతున్న శ్రమ దోపిడీని చూస్తుంటే ఆనాడు చికాగో నగరంలో అమరవీరుల త్యాగాలకు గుర్తింపు లేకుండా పోయిందని అనిపిస్తుంది. లేబర్ అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి.



జీవవైవిధ్య పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండల కేంద్రం తోపాటు బండ్లగూడెం, గుమ్మడవెల్లి, జీడికల్, సిరిపురం, మాణిక్యపురం, కళ్లెం గ్రామాల్లో సైకిల్ యాత్ర ద్వారా జీవవైవిధ్య పరిరక్షణ కోసం ప్రజలలో సోమవారం అవగాహన కల్పించారు. వరల్డ్ ఏయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2023 ప్రకారం ప్రపంచ దేశాలలో కాలుష్య కోరల్లో మొదట బంగ్లాదేశ్ రెండో స్థానం పాకిస్తాన్ మూడో స్థానం భారత్. ఒకవైపు అభివద్ధి మరోవైపు కాలుష్యం అన్నట్టుగా ఉన్న ఈ తరుణంలో ఆనాటి ప్రకతిని జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మన పూర్వీకులు మనకు ఇచ్చిన ప్రకతిని రాబోయే తరాలకు అందించాలని, ప్లాస్టిక్ కవర్లు వద్దు చేతి సంచులు ముద్దు, నింగికి చుక్కలు అందం, నేలకి మొక్కలు అందం భగభగ మండే ఎండలు వాతావరణ సమతుల్యతను కాపాడేది చెట్లకు తప్ప మన దేనికి లేదు. సమాజానికి ప్రకతికి మనము ఏమి ఇస్తే మరల మనకు అవే ప్రతిఫలంగా తిరిగే వస్తాయి. ముఖ్యంగా కాలుష్యం మరి ఎక్కువైన కొలది ఓజోన్ పొర రంధ్రాలు పడి ఈ భూమండలంపై ఉన్న ప్రాణులన్నీ అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది ఆయా గ్రామాలు ప్రజలకు వివరిస్తూ సైకిల్ యాత్ర కొనసాగించడం జరిగింది అన్ని గ్రామాల ప్రజల స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు, కుంటలు నింపాలని రైతుల నిరసన

నవతెలంగాణ-బచ్చన్నపేట

చిన్నరామన్ చెర్ల శివారు మొండికుంట స్టేజీ వద్ద దేవాదుల కాలువల ద్వారా చెరువు, కుంటను నింపి ఎండిపోతున్న రైతుల పంట పొలాలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి కొత్తపల్లి బాల నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం రైతు సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలలో కురిసిన వడగళ్ల వర్షానికి చిన్న రామన్ చర్ల గ్రామంలో వందలాది ఎకరాల పంట నష్ట పోయామని, పరిహారం అందిస్తామన్న గత ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ప్రభుత్వం అయినా స్పందించి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు వెంటనే



రైతు ఖాతాలో వేయాలని, రుణమాఫీ రెండు లక్షల అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ గళ్ళ అశోక్ ,బుర్రి సుధాకర్ , అన్నేబోయిన శ్రీనివాస్, అన్న బోయిన రాజు, గంధమాల మనోహర్, రేణిగుంట ఆంజనేయులు, రేణిగుంట వెంకటేశ్వర్లు, తురకపెల్లి భాను, గుడికందుల నాగరాజు, గుడికందుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

బార్ వర్కర్లు, కస్టమర్ల మధ్య ఘర్షణ

పోలీస్‌స్టేషన్ చేరిన పంచాయతీ

నవతెలంగాణ-జనగామ

పట్టణంలోని భువనబార్‌లో కస్టమర్లకు బార్ వర్కర్లకు మధ్య గొడవ జరిగింది. సోమవారం హోలీ పండుగ కావడంతో బార్‌లోకి మందు ప్రియులు కిక్కిరిసిపోయారు. నలుగురు కస్టమర్లు ఏసీ రూములో కూర్చుని ఇచ్చిన ఆర్డర్ ఆలస్యం కావడంతో కస్టమర్లు వర్కర్లను తీవ్ర పదజాలంతో దూషించినట్లు తెలుస్తుంది. దీంతో వర్కర్లతో పాటు కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తి, బార్‌లో పని చేస్తున్న మరి కొంతమంది వ్యక్తులు కలిసి ఒకేసారి కస్టమర్లపై దాడికి దిగినట్లు తెలుస్తుంది. దీంతో బార్‌లో కూర్చున్న నలుగురు వ్యక్తులు వారి బంధు వులకు స్నేహితులకు ఫోన్ చేయడంతో సుమారు 20మంది చేరుకున్నట్లు సమాచారం. దీంతో బార్‌లో పని చేస్తున్న వ్యక్తులు, కస్టమర్లకు సంబంధించిన బంధువులు ఎవరిపై ఒకరు చేయి



చేసుకున్నారు. దీంతో బార్‌లో పని చేస్తున్న ఇదరికీ తీవ్ర గాయాలైనట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని బార్ యజమాని సుగుణాకర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సదరు వ్యక్తులను పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిలో పల్లెల దాహం తీరేనా..!

- డ్యాంలలో నీరు లేక ఆగనున్న భగీరథ
- అందుబాటులో ఉన్న నీటి వనరుల మరమ్మత్తులు
- ముమ్మరంగా పనులు చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-ఖానాపురం

వేసవి సమీపించి రెండు నెలలుగా విపరీతంగా ఎండలు కొడుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మండలంలో భూగర్భ జలాలు అడుగంటి డ్యాముల్లో నీటి నిలువ తగ్గుముఖం పట్టింది. రానున్న ఇంకా ఏప్రిల్, మే నెలలో ఎండగా విపరీతంగా కొట్టే అవకాశాలు ఉండటంతో ప్రజలకు నీటి ఎద్దడి సమస్య తలెత్తేలా ఉంది.

మండలంలో 20గ్రామపంచాయతీలు ఉండగా ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకులు నిర్మించి పైపులైన్ ద్వారా మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. అయితే మండల ప్రజలు పూర్తిస్థాయిలో భగీరథ నీటికీ అలవాటు పడి, వాటి మీదనే ఆధారపడి ఉన్నారు. ఇది ఇలా ఉండగా రానున్నది వేసవికాలం కావడంతో భూగర్భ జలాలు అడుగు అంటడంతో భగీరథ నీటి సరఫరా చేసే డ్యాముల్లో నీటి నిలువ పూర్తిగా తగ్గుముఖం పట్టి నీటి ఎద్దడి సమస్య తీవ్రం కానున్నదని మండల



ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ముందస్తుగా ఆలోచన చేసి రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దటి తలెత్తకుండా ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలనేఉద్దేశంతో ఉన్నతాధికారులకు ప్రభుత్వం పలు ఆదేశాలు జారీ చేసింది. గ్రామాలలో అందుబాటులో ఉన్న బోరు బావులను, చేతిపంపులను వాడకంలోకి తీసుకు రావాలని సూచించారు. ఆదేశాలు అందుకున్న ఇంజనీరింగ్ అధికారులు మండల స్థాయిలలో సమావేశాలు ఏర్పాటు చేసి బోరు బావుల, చేతిపంపుల ప్రస్తుత పరిస్థితులను గ్రామ అధికారుల నుండి తీసుకొని వెంటనే వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇటీవల ప్రత్యేక నీటి సరఫరా విషయమై ఏడు రోజుల పాటు కార్యాచరణ రూపొందించి నీటి సమస్యలు గ్రామాలలో తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సూచనలు చేశారు. ఏదేమైనప్పటికీ నీటి సరఫరా అందించే డ్యాములలో నీటి నిల్వ తగ్గుముఖం పట్టడంతో భగీరథ నీరు ఆగిపోతే.. ప్రత్యామ్నాయ వనరుల ద్వారా పూర్తిస్థాయిలో గ్రామ ప్రజలకు నీరు అంది ప్రజల దాహం తీరుతుందా అనే ప్రశ్న మండల ప్రజలలో నెలకొన్నది.



నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం : సతీష్‌రెడ్డి(మిషన్‌భగీరథ ఏఈ)

గత వర్ష కాలంలో వర్షాలు తక్కువగా పడటంతో పాటు భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. డ్యాముల్లో నీటి నిలువ తక్కువగా ఉండడంతో మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోయే ప్రమాదం నెలకొన్నది. ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాలలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ఉండడానికి ప్రత్యామ్నాయంగా చేతిపంపులను బోరుబావులను అందుబాటులోకి తీసుకు వస్తున్నాం. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రత్నిస్తున్నాం.

ఎలక్షన్ కోడ్‌ను తుంగలో తొక్కిన పార్టీలు

మర్మోగిన డీజేల మోతలు

పోలీసుల ఆదేశాలు బేఖాతరు

నవతెలంగాణ- గీసుగొండ

ప్రసిద్ధిగాంచిన కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర లో భాగంగా సోమవారం రాత్రి నర్సంపేట వరంగల్ ప్రధాన రహదారిపై పార్టీల జెండాలతో ప్రభల జోరు కొనసాగింది. గీసుకొండ మండలం నుంచే కాకుండా నర్సంపేట,దుగ్గొండి, నల్లబెల్లి, సంగెం మండలాల నుండి పెద్ద సంఖ్యలో జాతరకు కదిలి వచ్చే ప్రభబడ్లను చూస్తే గతంలో కమ్యూనిస్టుల జ్ఞాపకాలను



సంద ర్శకులు నెమరు వేసుకునేలా జాతర పరి సరాలు తలపించాయి.

ప్రత్యేక ఆకర్షణగా కాంగ్రెస్ ప్రభ..

కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం బాల కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభను ఎమ్మెల్యే రేవూరి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ప్రభ ముందు మహిళలు ఆడే కోలాటాలు మరియు కళాకారుల డబ్బులు బౌన్సర్ల బందోబస్తు సందర్శకులకు కనులవిందుగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ధ్వజస్తంభ విగ్రహాల ఊరేగింపు శోభాయాత్ర

నవతెలంగాణ-గార్ల

మండలంలోని గోపాలపురం గ్రామంలో 25,26,27 తేదీలలో నిర్వహించే శీతల పరమేశ్వరి, బొడ్రాయి ప్రతిష్ఠ, ముత్యాలమ్మ ఆంజనేయస్వామి, లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయంలో జీవధ్వజ స్తంభం ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా విగ్రహాల శోభాయాత్రను సోమవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అర్చకులు, వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య ప్రత్యేక హెూమం,మహిళ లచే కుంకుమ పూజలు నిర్వహించి భక్తుల కోలాటాలు, భజన కీర్తనలుతో డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఘనంగా విగ్రహాల శోభా యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.



వైన్ షాప్‌లో ఇరువర్గాల మధ్య గొడవ

బీరుసీసాతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పెద్దవంగర

మండల కేంద్రంలోని వైన్‌షాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు వీరంగం సష్టించారు. అందులో పని చేసే యువకులే మద్యం మత్తులో బీరుసీసాతో దాడి చేస్తున్నారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్, తొర్రూరు పట్టణానికి చెందిన శ్రీనివాస్ ఇరువురు కలిసి స్థానిక వైన్ షాప్‌లో గతకొంతకాలంగా పని చేస్తున్నారు. రోజూ వారి పనుల్లో భాగంగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన ఇద్దరూ బీరు సీసాలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో వేముల శ్రీనివాస్‌కు తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన శ్రీనివాస్ ను వైద్యం నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-మరిపెడ

బీజేపీ మరిపెడ మండలం ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా ఎడ్జెర్ల గ్రామానికి చెందిన సొంటి రజినికాంత్ గౌడ్ ను నియమిస్తూ మానుకోట జిల్లా బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పైండ్ల శ్రీనివాస్ ఆదేశాలతో నియామక పత్రాన్ని రజినికాంత్ కు అందజేశారు. సోమవారం ఈ సందర్భంగా నియమితులైన మరిపెడ మండల ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు సొంటి రజినీకాంత్ మాట్లాడుతూనాపై నమ్మకంతో నాకు ఇచ్చిన పదవికి వన్నె తెచ్చి, పార్టీని మండలంలో గ్రామాల వారీగా అభివద్ధి చేస్తానని, అలాగే గ్రామాల్లో గ్రామ కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేస్తానని, ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న అభివద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కషి చేస్తానని అన్నారు. అలాగే నా ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర బిజెపి నాయకులు గాదె రాంబాబు ,పెద్దలందరికీ రుణపడి ఉంటానని, అలాగే నా పై నాయకుల ఆదేశాల మేరకు నడుచుకుంటూ వారి సలహాలు సూచనలు పాటిస్తూ పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కషి చేస్తానని అన్నారు.



ఊరుగొండలో పండుగ పూట విషాదం

నవతెలంగాణ-దామెర

మండలంలోని ఊరుగొండలో పండుగ పూట విషాదఛాయలు అలుముకున్నాయి. కెనాల్ లో మునిగి ఇద్దరు వ్యక్తులు మరణించిన సంఘటన కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలివేల్పులలో జరిగినది . వీరిద్దరిదీ ఊరుకొండ గ్రామం. బంధువులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తక్కెళ్ళ కేదారేశ్వర్ వయసు (45) ముప్పు క్రాంతి కుమార్ (35) ఇద్దరూ ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థల్లో పని చేస్తూ భీమారంలో నివాసం ఉంటున్నారు. మధ్యాహ్నం హోలీ వేడుకల్లో పాల్గొని స్నానం చేయడానికి కెనాల్‌లో దిగారు. నీటి ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఈత రాకపోవడంతో మునిగి పోయారు. విషయం తెలిసిన కేయూ పోలీసులు మతదేహాల కోసం వెతకడం ప్రారంభించగా ఒకరి కేదారేశ్వర మతదేహం మాత్రమే దొరికినట్టు తెలిపారు. ఈ వార్త గ్రామంలో తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం హెూలీ వేడుకలు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ప్రారంభించారు. ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సంతో షంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ కాంక్షించారు. కుటుంబ సభ్యులతో, కాంగ్రెస్ నాయకులతో, కార్యక ర్తలతో హెూలీ రంగులు పూసుకొని సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ భూసాని రాము, మండల పార్టీ అధ్యక్షుడు చుంచు సంతోష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమరాజు శేఖర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో....

హెూలీ సంబరాలు రంగురంగుల, నవ్వుల కేరింతలతో స్థానిక డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి హాస్పిటల్ నుండి పురవీధులలో హెూలీ సందడి కొనసాగింది. ఒకరినొకరు అభినందించుకుంటూ వివిధ రంగులు చల్లుకుంటూ ఆనందపు అంచులలో మునిగి పోయారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి, డాక్టర్ కొత్త యాదగిరి రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రామ నరసయ్య, తుమ్మేటి వెంకట్ రెడ్డి, ప్రతాపని వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షులువిజయ పాల్ రెడ్డి, సెక్రటరీ పెరుమాండ్ల రమేష్, తాటికొండ శ్రీనివాస్, దామెర సరేష్, మాదారపు వేణుగోపాల్, నాళ్ళ కష్ణమూర్తి, చిది రాల నవీన్ కుమార్, తమ్మి ఉపేందర్ రావు, తమ్మి రమేష్, రామిశెట్టి భాస్కరాచారి, తంగళ్ళపల్లి వెంకటేశ్వర్లు, కోనే ప్రభాకర్, దారం కుమారస్వామి, ప్రవీణ్ రాజు, సతీష్ రెడ్డి, మూడుపు రవీందర్ రెడ్డి, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో...

చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షులు మచ్చా సురేష్ కార్యవర్గ సభ్యులతో కలిసి హెూలీ వేడుకలు



జరిపారు. వ్యాపారస్తులకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనగిరి శంకర్, చిధిరాల శ్రీనివాస్, పెరుమాండ్ల చక్రపాణి, వివిధ యూనియన్ల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నెల్లికుదురు : మండలంలోని వివిధ గ్రామాలలో చిన్నపిల్లలు పెద్దలు మహిళలు పెద్ద మొత్తంలో హెూలీ వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. వారి ఇళ్ల నుండి రోడ్లపైకి వచ్చి రంగురంగుల కలర్లతో కలలు ఒకరు రంగులు పూసుకుంటూ హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.

పెద్దవంగర : హోలీ సంబరాలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే యువతీయువకులు, విద్యార్థులు రంగులతో వీధుల్లో సంచరిస్తూ, ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ, రంగు నీళ్లు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ.. ఆనందంగా గంతులు వేశారు. హెూలీ.. హెూలీ రంగోళీ.. అంటూ చిందులు కూడా వేశారు. గ్రామాల్లోని వీధులు రంగులమయం అయ్యాయి. నాయకులు, పోలీసులు, జర్నలిస్టులు ఒకరికొకరు రంగులు చల్లి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గూడూరు : హోలీ పండుగను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రముఖులు రాజకీయ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు జర్న లిస్టులు వివిధ సంఘాల బాధ్యులు హెూలీ సంబరాలలో పాల్గొన్నారు గూడూరు మండల కేంద్రంలో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాల నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు, జర్నలిస్టులు సీఐ బాబురావుకు కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు, పెద్దలు అందరూ కలిసి వీధుల్లో సరదాగా వివిధ కలర్లతో సంబరాలను కొనసాగించారు. గూడూరు మండల కేంద్రంతో పాటువివిధ గ్రామాలలో సంబరాలు నిర్వహించారు.

గార్ల : మండంలోని వివిధ గ్రామాలలో హెూలీ పండగ వేడుకలను ఆనంద ఉత్సవాలతో యువత, మహిళలు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్లో లభించిన వివిధ రకాలైన రంగులు, ప్రకతిలో పూలతో లభించే కలర్లను చేత పూసుకొని ఒకరికొకరు పూసుకున్నారు. పోలీసు స్టేషను లో ఎస్సై జీనత్ కుమార్ అధ్వర్యంలో పోలీసు సిబ్బంది, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి హెూలీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మద్రిగూడెం గ్రామంలో జడ్పీటీసి జాటోత్ ఝాన్సీలక్ష్మి అధ్వర్యంలో మహిళలు హెూలీ వేడుక లను జరుపుకున్నారు.

మరిపెడ : చిన్న పిల్లలలు పెద్దలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఘనంగా జరుపుకునే ఏకైక పండుగ రంగుల హెూలీని మరిపెడ మండలంలో 44గ్రామ పంచా యతీలలో, మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులలో ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఫిబ్రవరి లేదా మార్చి నెలలో వచ్చే రంగుల హోలీని చిన్నారులు పురవీధుల్లో తిరుగుతూ ప్రశాంతంగా జరుపుకున్నారు.

బయ్యారం : మండల కేంద్రంతో పాటు, మండలంలోని అన్ని గ్రామాలలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రంగుల పండుగ కేరింతలు, ఆనందోత్సవాల మధ్య ప్రజలు హోలీ పండుగను జరుపుకున్నారు. చిన్నారులు, యవతీ యువకులు, పెద్దలు రంగుల్లో మునిగి తేలారు.

కేసముద్రం రూరల్ : కేసముద్రం స్టేషన్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. హోలీపండుగ పురస్కరించుకొని కేసముద్రం స్టేషన్‌లో పలువురు గ్రామ పెద్దలు, యువకులు, పిల్లలు వీధులలో తిరుగుతూ ఒకరిపై ఒకరు సాంప్రదాయ పద్ధతిలో రంగులు చల్లుకొని శు భాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు పెద్ద బజారులో గుమిగుడి పాటలు పాడుతూ నత్యం చేసి హెూలీ వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల చరణ్ గౌడ్, నాగనబోయిన సిద్ధార్థ్ యాదవ్,ఓలం అభిరాజ్, వేల్పుల సాయి ఉత్తమ్, గుణగంటి ఉదయ్,కుర్న త్రిశూల్, మిడతనపల్లి సాత్విక్, పాయిరాల సతీష్,చి ంటు, సంగీత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి వైన్స్ సిండికేట్

మందుబాబుల ఆగ్రహం..

ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని యువకులు ఆందోళన

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాద్ జిల్లా చిన్న గూడూరు మండలం వైన్ షాపు దంద తెరపై కొచ్చింది, పండగ పూట వైన్ షాప్ కి వస్తే మందు అందుబాటులో లేకుండా వైన్ షాప్ వాట దార్లు చేశారని మందుబాబులు సోమవారం భద్రకాళి వైన్స్ ముందు ఆందోళన చేశారు. ఒక పక్క ఎలక్షన్ కూడా అమల్లో ఉన్న లైట్ బీర్లను అధిక ధరలకు విక్రయిస్తూ బీర్లు లేవని బుకయిస్తున్నారని తెలిపారు. వాస్తవానికి 180 రూపాయలకే బీరు అమ్మ వలసి ఉండగా సిండికేట్ దందాతో బయట అధిక ధరలు అమ్ముతున్నారని యువకులు ఆందోళన చేశారు. స్థానిక వైన్ షాప్ సిండికేట్ పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని మందుబాబులు మండిపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మందు బాబుల ఆందోళనను విరమింపజేశారు.



కాలుష్య కోరల్లో మరిపెడ

రహదారుని కమ్మేస్తున్న పొగ, దుమ్ము ధూళి..!

అనుమతి లేని బట్టీలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మరిపెడ

కాలుష్య కోరల్లో మరిపెడ చిక్కుకుంది, ఇటుక బట్టీల పొగతో పట్టణాన్ని రహదారులను కమ్మేస్తున్న వైనం నెలకొంది, అనుమతి లేకుండానే జాతీయ రహదారుల వెంబడి ఇటుక బట్టీల వ్యాపారానికి అనుమతి ఇవ్వడంతో రోడ్డు వెంబడి దుమ్ము ధూళి పొగతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. 365 జాతీయ రహదారి కి ఇరువైపుల ఇటుక బట్టీల వ్యాపారానికి హద్దులు లేకుండా పోతున్నాయి, వాటిని నియంత్రించాల్సిన అధికారులు చేతులు తడుపుకొని అనుమతిని ఇచ్చినట్లు మరి పెడ ప్రజల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి,


ఇటుక బట్టీలు విచ్చలవిడి వ్యాపారానికి ముడి సరుకు చెరువుల కుంటల నుండీ అక్రమ రేకుడి మట్టి తవ్వకాలు జరిపి గుట్టలు గుట్టలుగా మట్టి నిల్వలు ఏర్పాటు చేసుకున్నారు. బతుకుదెరువు కోసం వచ్చామని బయలుదేరిన ఇటుక బట్టి వలస కార్మికులు ఇవాళ లక్షాధికారులు ఎలా అయ్యార పలువురు ప్రశ్నిస్తున్నారు..? ఇక్కడ తయారుచేసిన ఇటుక ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మరిపెడ మండలంలోని తండ ధర్మారం, అబ్బాయి పాలెం, మరిపెడ, బురహాన్ పురం, తానంచర్ల, బక్కరూప్లా తండ, గిరిపురం తదితర ప్రాంతాలలో జాతీయ రహదారుల వెంబడి ఇటుక బట్టి తయారుచేయడంతో దానికోసం వాడే ఉనుక, డస్టు, తోపాటు పొగ కమ్మేసి రోడ్డు పై వెళ్లే వాహనదారులు ప్రమాదాల గురవుతున్నారని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఇటుక బట్టి తయారీకి అనుమతి ఇవ్వాలి కానీ, పట్టణ నడిబొడ్డున, గ్రామాల మధ్యన పర్మిషన్లు ఇవ్వడంతో అటు గుండె జబ్బులు ఉన్నవారికి ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి ఈ పొగ ఇబ్బందికరంగా మారిందని మరిపెడ ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్





ఊరికి దూరంగా ఇటుక బట్టీలు ఉండాలి : అప్సర్ పాషా (కాంగ్రెస్ -మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి)

ఆంధ్రా నుంచి వలస వచ్చిన ఇటుక బట్టి వ్యాపారస్తులకు మట్టి తరలింపుకు అను మతులు ఎవరు ఇచ్చారు. ఇటుక బట్టీలు ఊరికి దూరంగా ఏర్పాటు చేసు కోవాలి. రహదారి వెంట ఇటుక బట్టీలు ఉండ టంతో వాటి ద్వారా వచ్చే పొగ మబ్బుతో కాలుష్యం కోరల్లో నిండిపోతుంది. ఇప్పటికైనా అధికారులు ఇటుక బట్టీ వ్యాపారులతో మాట్లాడి ఊరికి దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలి.



రోడ్డుపై వెళ్తుంటే కంట్లో ధుమ్మాదూళీ పడుతుంది : (ద్విచక్రవాహనదారుడు ఎడెల్లి సైదులు)

ఇటుక బట్టీలు రోడ్లకు ఇరువైపులా ఉండడంతో పనులను నిమిత్తం రో డ్డుపై వెళ్తుంటే కండ్లలో ధుమ్మా దూళీ పడి తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నాయి. ఈ విష యమై గతంలో అధి కారుల దష్టికి తీసుకు పోయినా మున్సి పాలిటీ శాఖ అధి కారులు స్పందించలేదు. ఇప్పటికైనా జిల్లా అది, కారులు స్పందించి ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి.



కాళేశ్వరం అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద సోమవారం సాయంత్రం కాళేశ్వరం ఎస్సై భవానిసేన ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. పార్లమెంటు ఎన్నికల దృష్ట్యాఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాహన తనిఖీ చేపట్టారు. సరియైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించి అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

హోలీ పండుగ పూట విషాదం

నవతెలంగాణ-గణపురం



హోలీ పండగ రోజు విషాద ఛాయలు అలుముకున్నాయి. మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని బొట్ల రమేష్ (30) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన చెల్పూర్‌లో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... చిట్యాల మండలం జడలపేట గ్రామానికి చెందిన బొట్ల రమేష్ (30) చెల్పూర్ శివారు వీరయ్య పల్లి గ్రామంలో ఒక కార్యక్రమానికి రమేష్ తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ధర్మరావుపేట గ్రామానికి చెందిన మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో రమేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి రమేష్‌ను భూపాలపల్లి ఆసుపత్రికి తరలిం చగా అప్పటికే రమేష్మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేషు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సూరారంలో టీబీ నివారణ పట్ల ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-మహాదేవ్‌పూర్

జయశంకర్ భుపాలపల్లి జిల్లా వైద్యారోగ్య అధికారి, డాక్టర్ మధుసూధన్ ఆదేశాల మేరకు మహాదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పూనెం రామారావు ఆధ్వర్యంలో సూరారంలో క్షయ వ్యాధి నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ప్రభుత్వం 6 నెలల వరకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, 6 నెలల పాటు నెలకు రూ.500 చొప్పున సహాయ పారితోషికం అందిస్తుందని తెలిపారు. ఏదేని సందేహాలు ఉంటే వైద్యారోగ్య సిబ్బందికి సమాచారం అందించి వారి సేవలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్, ఎంఎల్ హెచ్‌పీ మురళీధర్‌రెడ్డి హెచ్‌ఈఓ మాశూక్ అలీ, హెచ్‌ఎస్ నిర్మలా మేరి, హెచ్‌వి సత్య నారాయణ, హెచ్‌ఎ కనక దుర్గ, ఏఎన్‌ఎం శైలజ, ఆశ వర్కర్లు శ్రీదేవి సారక్క, శారద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డోలోత్సవం



నవతెలంగాణ-మహాదేవపూర్

మండలంలోని మందరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం డోలోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం హోలీ పర్వదినం సందర్భంగా ఉదయం అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఓడేటి రవీందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు నవీనాచార్యులు పాల్గొన్నారు.

దానా బస్తాలు అందజేత



నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గోశాల గోమాతలకు అమెరికా కాలిఫోర్నియాలో ఉంటున్న ఉయ్యూరు రామకష్ణ శిల్ప చౌదరి ఎన్‌ఆర్‌ఐ దంపతులు దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు నరేష్ వారిని ఘనంగా సన్మానించగా కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ రాష్ట్ర నాయకుడికి సన్మానం



నవతెలంగాణ-గణపురం

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఆకుల సుభాష్ ముదిరాజ్‌ను సోమవారం సన్మానించారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో జిల్లా ఉపాధ్యక్షులు అల్లం స్వామి ముదిరాజ్, బుద్దారం కుల సంఘం అధ్యక్షులు మాల రవి ముదిరాజ్, రామాంజపూర్ సొసైటీ మాజీ అధ్యక్షులు ఘనవేణి అనిల్ కుమార్‌ముదిరాజ్, ఘనపూర్ మండల మెపా అధ్యక్షులు అల్లం రవీందర్ ముదిరాజ్, తదితర నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకుల సుభాష్ గ్రామీణ స్థాయి నుండి మండల, జిల్లా, రాష్ట్రస్థాయికి చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గోదావరి నదీ హారతి కార్యక్రమం



నవతెలంగాణ-మహదేవపూర్

మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదావరి నదీ హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెడెంట్ బుర్రి శ్రీనివాస్, సిబ్బంది, గ్రామస్తులు సేవాసమితి, సభ్యులు పాల్గొన్నారు.

తాడిచెర్లలో 'సహకార' రాజకీయం ?

- అవిశ్వాసాలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- నేడు చైర్మన్,28న వైస్ చైర్మెన్‌లపై తీర్మానాలు
- తీర్మానాలపై నెగ్గేది ఎవరో ?

నవతెలంగాణ-మల్హర్‌రావు

నాలుగేండ్లుగా ఎప్పుడు వివాదాస్పదంగా కొనసాగుతున్న మండల కేంద్రమైన తాడిచెర్లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మరోసారి ఉత్కంఠకు తెరలేపింది. పీఏసీఎస్ సహకారంలో రాజకీయం వేడెక్కింది. ఫిబ్రవరి 29న చైర్మన్, మార్చి-1న వైస్ చైర్మన్‌పై సింగిల్ విండో డైరెక్టర్లు అవిశ్వాసాలు పోటాపోటీగా ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో తీర్మానాలు




ప్రవేశపెట్టడానికి అధికారులు తేదీలు ఖరారు చేశారు. దీంతో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ సీట్ల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో తీవ్రమైన పోటీ నెలకొంది. ప్రస్తుత చైర్మన్ చెప్యాల రామారావు తనకున్న సభ్యులతో ఇప్పటికే ముందస్తుగా రహస్య క్యాంపునకు తరలించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి చైర్మన్‌గా పోటీలో ఉన్న ప్రస్తుత సింగిల్ విండో డైరెక్టర్ ఇప్ప మొండయ్య తన మద్దతు సభ్యులతో సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఒక్కరోజు వ్యవధిలో చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టారు. నేడు(మంగళవారం) చైర్మన్ అవిశ్వాస తీర్మానం, 28న వైస్ చైర్మన్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్టు అధికారులు ప్రకటించారు. తాడిచెర్ల ప్రాథమిక సహకార సంఘంలో అనూహ్యంగా చైర్మన్ చెప్యాల రామారావు, వైస్ చైర్మెన్ మల్కా ప్రకాష్‌రావుపై సభ్యులు పోటాపోటీగా అవిశ్వాసాలు పెట్టారు. సంఘంలో 13 మంది సభ్యులు ఉండగా ఒక్కరు ఇటీవల మృతి చెందారు. మిగిలిన 12మందిలో ప్రస్తుత చైర్మన్ తరుపున 5గురు సభ్యులు క్యాంపులో ఉన్నారు. కాంగ్రెస్ వైపు ఏడుగురు సభ్యులు ఉన్నారు. అవిశ్వాసం నెగ్గాలంటే 9మంది తప్పకుండా ఉండాలని తెలుస్తోంది. అవిశ్వాసం నెగ్గడం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ నెగ్గడం క్లిష్ట తరమే అనిపిసోతంది. ఎలాగైనా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో చైర్మన్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ సభ్యులు వ్యూహంలో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. దీంతోపాటు వైస్ చైర్మెన్‌కు సైతం సంఖ్య బలంగా తక్కువగా ఉందని తెలుస్తోంది. ఎలాగైనా పన్నాగం పొంది చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎత్తుగడలు వేస్తున్నట్లు సమాచారం.

నేటి నుంచి శ్రీ నాగులమ్మ జాతర

- సుంకు పండగకు సర్వం సిద్ధం: రామకృష్ణ





నవతెలంగాణ-మంగపేట

మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధి లక్ష్మీనర్సాపూర్ గ్రామంలో వెలిసిన గిరిజనుల శ్రీ నాగులమ్మ మినీ జాతర నేటి నుండి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు వైభవోపేతంగా జరిగే ఈ జాతర నేడు మండే మెలుగు కార్యక్రమంతో ప్రారంభమవుతుంది. సుంకు పండగలో భా గంగా నాగులమ్మకు ఆదివాసీ సాంప్రదాయ బద్దంగా ఈ జాతరను నేటి నుండి మార్చి 29 వరకు నిర్వ హించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ తెలిపారు. ఏటా మహా జాతరను, సుంకు పండగను ప్రతి రెండేండ్ల కోసారి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మార్చి



27న అభిషేకాలు, ప్రత్యేక పూజలు మార్చి 28న గోదావరి పుణ్యస్నానాలు,అదే రోజు రాత్రి 11.45 గంటలకు సుంకు పండగ నిర్వహించి, డాలు, గుడ్డచరిత్రను కోయ పూజారులతో ఆర్తి బిడ్డల డోలు వాయిద్యాల నడుమ నిర్వహిస్తారు. శుక్రవారం లక్ష్మీ నర్సాపురం గ్రామ మాడ వీధుల్లో ఊరేగింపుతో సుంకు పండగ ఉత్సవంతో నాగులమ్మ మినీ జాతర ముగుస్తుంది. ఈ పూజా కార్యక్రమాలు ఆద్యంతం ఆదివాసీ పూజారులు, వడ్డెల సమక్షంలో జరు గుతుంది.

సుంకు పండగకు సర్వం సిద్ధం

సుంకు పండగ సందర్భంగా జాతరకు వచ్చే ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఆలయం వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ ట్రస్టీ రామకృష్ణ తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, చలువ పందిళ్ళు, నీటి వసతులు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవికి రాజీనామా : సాయికుమార్

నవతెలంగాణ-గోవిందరావుపేట



బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు సూరపనేని సాయికుమార్ తెలిపారు. సోమ వారం మండల కేంద్రంలో సూరపనేని సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల వల్ల తాను కలత చెం దినట్లు, ప్రస్తుత పరిస్థితుల్లో అధ్యక్ష పదవికి న్యాయం చేయలేనేమో అన్న సందిగ్ధ పరిస్థితుల్లో తానే నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. ఈ విషయంలో ఎవరి ఒత్తిడి ప్రమేయం లేకుండానే స్వచ్ఛం దంగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామాను జిల్లా పార్టీ నాయకులకు పంపినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఏ పార్టీలోనూ చేరేది లేదని భవిష్యత్తు నిర్ణయం ఇంకా తీసుకోలేదని అన్నారు. తనను నమ్ముకున్న ప్రజలు, నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు. ఇంతకాలం మండల పార్టీ అధ్యక్షునిగా తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ములుగు ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా హోలీ సంబురాలు



నవతెలంగాణ - ములుగు

జిల్లా ఎస్పి కార్యాలయములో హెూలీ సంబురాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పోలిస్ అధికారులు ఎస్పి శబరిష్‌కు అధికారులు, సిబ్బంది రంగులు పూసి హెూలీ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఎస్పీ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ రవీందర్, సిఐ ములుగు రంజిత్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, పస్రా సిఐ శంకర్, ఎటునాగారం సిఐ రాజు, ఆర్ఐ అడ్మిన్ సతీష్, ఆర్ఐ హెూంగార్డ్స్ వెంకటనారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి తిరుకళ్యాణం

- సౌకర్యాల కల్పనలో దేవాదాయశాఖ వైఫల్యం





నవతెలంగాణ-వెంకటాపురం

శ్రీవెంకటేశ్వర స్వామి పద్మావతి, అలివేలు మంగ తిరుకల్యాణ మహెూత్సవం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాదాయ ప్రాంగణంలో సోమవారం కన్నుల పండుగలా జరిగింది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దంపతులు, స్థానికులు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయవాది పిట్టా శ్రీనివాసరెడ్డి దంప తులు హాజరయ్యారు. ఛత్తీస్‌ఘడ్,మహారాష్ట్రతోపాటు చుట్టుపక్కల జిల్లాల నుండి వేలాదిమంది సందర్శకులు తరలొచ్చారు. కాగా ప్రజలకు సౌకర్యాల కల్పనలో దేవాదాయశాఖ వైఫల్యం చెందిందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. కనీసం తాగు నీటి సౌకర్యం కల్పించ లేదన్నారు. వేలాది మంది తరలి రాగా మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడ్డారని అన్నారు. 12.30 జరగాల్సిన కళ్యాణ మహెూత్సవం మధ్యాహ్నం 2 గంటల తరువాత జరగడం తో మండు టెండ, ఉక్కపోత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేవాదాయశాఖ వారు భక్తులకు త్రాగునీరు అందించక పోవడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోడవర్తి నర్సింహ మూర్తి,మండల అధ్యక్షులు గంపా రాంబాబు ఆధ్వర్యంలో వాటర్ బాటిల్, పులిహెూర ప్యాకెట్లు అందజేశారు. మండల కేంద్రంలో ఇంత పెద్ద జాతర జరుగుతున్నా.. మండలంలో ఇసుక డంపింగ్‌ను అధికారులు నిలుపుదల చేయక పోవడంతో వందలాది ఇసుక లారీల వల్ల ప్రధాన రహదారిపైకి రావడంతో కల్యాణ మహెూత్సవానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు : ఎస్సై కమలాకర్



నవతెలంగాణ-గోవిందరావుపేట

అక్రమంగా.. ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్ఐ ఏ కమలాకర్ హెచ్చరించారు. సోమవారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న నలుగురిని అదుపు లోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగ పూర్ గ్రామానికి చెందిన అంబాల నరేందర్ గోవిందరవుపేట శివారు సోమలగడ్డ క్రాస్ రోడ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న పన్నలా శ్రీనివాస్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో అక్రంగా ఇసుక నిల్వ చేశాడు. జంగలపల్లి గ్రామానికి చెందిన గంగుల రాజు, ఎడ్ల శ్రీకాంత్, చల్వాయి గ్రామానికి చెందిన నాయిని నరేష్ తో కలిసి జేసీబీ ట్రిప్పర్ సాయంతో అక్రమంగా ఇసుకను తరలించేందుకు యత్నించారు. ఆదివారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా వారు పారిపోయేందుకు యత్నించగా పోలీసులు పట్టుకున్నారు. జేసీబీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రమాద ఘంటికలు ?

- పడిపోతున్న భూగర్భజలాలు వట్టిపోతున్న బోర్లు
- ఎండలు ముదిరే కొద్దీ మరింత కష్టం
- ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేసిస్తున్న రైతులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

గత వర్షాకాలంలో వర్షాలు సకాలంలో కురువకపోవడంతో మండలంలో భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోయి బోర్ మోటార్లు వత్తిపోయి, చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. దీంతో ఎండలు ముదిరితే ప్రమాద ఘంటికలు పొంచి ఉన్నాయి. సాగు, తాగు నీటికి ఇబ్బందులు తలెత్తనున్నాయి. మార్చిలో నీరు పాతాళానికి పడిపోగా ఎప్రిల్ నెలలో మరింత గడ్డు పరిస్తితి ఏర్పడే ప్రమాదం ఉంది. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే జల వనరుల అవిరయ్యాయి. సాగు,తాగు నీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురైయ్యే అవకాశం కనిపించడంతో ప్రభుత్వం సమస్యను ముందస్తుగా గుర్తించి చర్యలకు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. మండలంలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ వానా కాలం ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో భూగర్భజలాలు ఇప్పటికే 400 అడుగుల్లోకి అడుగంటాయి. గత ఏడాది వేసవిలో అకాల వర్షాలు కురవడంతో భూగర్భజలాల్లో తగ్గడం కనిపించలేదు.

మండలంలోని గాదంపల్లి, దుబ్బపేట, కిషన్ రావుపల్లి, పెద్దతూండ్ల,మల్లారం, తాడిచెర్ల, చిన్న తూండ్ల, ఆన్‌సాన్‌పల్లి గ్రామాల్లో ఫిబ్రవరిలో 180 నుంచి 250 అడుగులు, మార్చి నెలలో 250 నుంచి 350 అడుగుల వరకు భూగర్భజలాలు ఉంటె, ఈ ఏడాది ఫిబ్రవరిలో 250 నుంచి 350, మార్చిలో 350 నుంచీ 450 అడుగుల మేర భూగర్భజలాలు పడిపోగా బోర్ బావులు వట్టిపోతున్నాయి. ఇందుకు తోడుగా మానేరు పరివాహక ప్రాంతాల్లో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భజలాలు మంరితగా అడుగంటి పోయి వరి పొలాలు ఎండిపోతున్నాయి.



సాగునీటి కష్టాలు....

యాసంగి పంటలకు సాగునీరు అందక ఇప్పటికే మండలంలో గాదంపల్లి, పెద్దతూండ్ల, తాడిచెర్ల గ్రామాల్లో పొలాలు ఎండిపోతున్నాయి. బోర్ బావుల్లో నీరు అడుగంటడంతో పంటలకు నీరు అందడం లేదు. బోర్లు వేసిన పరిస్థితి ఆశాజనకంగా మారడంతో రైతులు నష్టపోతున్నారు.వేసవి ప్రారంభంలోనే భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోవడంతోపాటు బోర్లు కూడా నీటిని అందించలేకపోతున్నాయి.దీంతో రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. పొలాలు పొట్ట, ఈనే దశలో ఉన్నాయని ఇంకా సరిగా 20 రోజుల వరకు నీరు అందితే పొలాలు చేతికొస్తాయి. లేదంటే ఆరుగాల కష్టం గోదావరిలో పోసిన పన్నీరులా అవుతుందని రైతులు వాపోతున్నారు.

ఘనంగా హెూలీ వేడుకలు

- పాల్గొన్న ఎస్పి కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి

జిల్లా పోలిస్ కార్యాలయంలో సోమవారం హెూలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పి కిరణ్ ఖరే పాల్గొని, పోలిసు అధికారులు, సిబ్బంది, పాత్రికేయులతో కలిసి నృత్యాలు చేసి హెూలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలిసు అధికారులు, సిబ్బందికి హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతీసాంప్రదాయాలను పండుగలు చాటి చెబుతాయని



ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. దేశంలో మనం జరుపుకునే పండుగలు ఎంతో గొప్పవని. ప్రతి పండుగకు ఒక ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తమ ఆచారాలు, సాంప్రదాయాల గురించి తెలియజెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. హెూలీ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డిఎస్పీ ఎ. సంపత్ రావు, కాటా రం డిఎస్పీ జి. రామ్మోహన్ రెడ్డి, భూపాలపల్లి, కాటారం, చిట్యాల, మహదేవ్ పూర్ సిఐలు నరేష్ కుమార్, నాగార్జునరావు, మల్లేష్, రాజేశ్వర్ రావు, రిజర్వు ఇన్స్పెక్టర్ లు నగేష్, కిరణ్, రత్నం, జిల్లా పరిధిలోని ఎస్ఐ లు, పాత్రికేయులు, పోలిసు సిబ్బంది పాల్గొన్నారు.